నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, మంగళవారం 15 అక్టోబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM

## వినతుల పరిష్కారానికి చొరవ చూపండి..

### ఖమ్మం అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ



వినతులు స్వీకరిస్తున్న ఖమ్మం అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ

మామిళ్లగూడెం, అక్టోబర్ 14 : ప్రజావాణిలో బాధితులు సమర్పించిన వినతుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని ఖమ్మం అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజావాణి సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. టేకులపల్లి ప్రాంతానికి చెందిన శారద, ఖమ్మం నగరానికి చెందిన పి.దేవకరుణ, సత్తుపల్లి మండలం కాకర్లపల్లికి చెందిన జొన్నలగడ్డ రాములు తమ తమ సమస్యలపై దరఖాస్తులు సమర్పించారు. అనంతరం పెండింగ్ ప్రజావాణి దరఖాస్తులు, బయోమెట్రిక్ హాజరు, పాలనాపరమైన అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులలో శాఖల వారీగా పెండింగ్ ఉన్న వాటిని వెంటనే పరిష్కరించాలని, డివిజన్ స్థాయి వాటిని డివిజన్లకు, మండల స్థాయి వాటిని మండలాలకు పంపించాలని సూచించారు. మండల ప్రత్యేకాధికారులు పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది బయోమెట్రిక్ హాజరు తక్కువగా ఉన్నదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి శాఖ అధికారి వారి పరిధిలోని సిబ్బంది హాజరును రోజువారీగా పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో దీక్షా రైనా, డీఆర్‌డీవో సన్యాసయ్య, డీఆర్వో రాజేశ్వరి, కలెక్టరేట్ ఏవో అరుణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## అర్జీలను పరిశీలించి, పరిష్కరించండి..

### భద్రాద్రి అదనపు కలెక్టర్ వేణుగోపాల్



విజ్ఞప్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ) : పలు సమస్యలపై బాధితులు సమర్పించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని భద్రాద్రి అదనపు కలెక్టర్ వేణుగోపాల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వినతులు స్వీకరించిన ఆయన వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేశారు. టేకులపల్లి మండలం పానుగోతుతండాకు చెందిన భూక్యా మంగి తనకు ఇల్లు మంజూరు చేయాలని, మణుగూరు విఠల్ నగర్‌కు చెందిన రావుల కుమారస్వామి దివ్యాంగుడినైన తనకు రావాల్సిన ఉద్యోగాన్ని వెంటనే ఇప్పించాలని, బొల్లోరిగూడెం న్యూ పాల్వంచకు చెందిన బొల్లి రవి తనకు గృహజ్యోతి పథకం కింద జీరో బిల్లు అందడం లేదని, తనకు న్యాయం చేయాలని కోరారు. అలాగే బూర్గంపాడుకు చెందిన గోనెల బ్రహ్మం తనకు పాస్‌బుక్ ఇప్పించాలని అర్జీ సమర్పించారు. ప్రజావాణిలో జిల్లాలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గిరిజనులకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు

### గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ ఏపీవో డేవిడ్‌రాజ్



ఐటీడీఏలో వినతులు స్వీకరిస్తున్న ఏపీవో డేవిడ్‌రాజ్

భద్రాచలం, అక్టోబర్ 14 : అర్హులైన నిరుపేద గిరిజన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ఐటీడీఏ లక్ష్యమని భద్రాచలం ఐటీడీఏ ఏపీవో(జనరల్) డేవిడ్‌రాజ్ అన్నారు. భద్రాచలం ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ గ్రామాల వచ్చిన గిరిజనుల నుంచి ఏపీవో అర్జీలు స్వీకరించారు. వాటిని ఆయా శాఖల అధికారులకు పరిష్కారం నిమిత్తం పంపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ట్రైకార్ ద్వారా సబ్సిడీ రుణాలు, పోడు భూములు, వ్యక్తిగత సమస్యలు, స్వయం ఉపాధి పథకాలకు సంబంధించి రుణాలు, పట్టా భూములకు రైతుబంధు, జీవనోపాధి పెంపొందించేందుకు ఆర్థిక సాయం, దీర్ఘకాలిక రోగాలకు వైద్యం చేయించుకునేందుకు ఆర్థియ సాయం, గురుకులాల సీట్లు, పై చదువులకు ఆర్థిక సాయం కోసం అర్జీలు వచ్చినట్లు తెలిపారు. అలాగే దసరా సెలవుల తర్వాత తిరిగి వసతి గృహాలకు చేరుకునే విద్యార్థులకు వార్డెన్లు తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో డీడీ మణెమ్మ, గురుకులం ఆర్‌సీవో నాగార్జున రావు, డీటీ ఆర్‌వోఎఫ్ఆర్ లక్ష్మీనారాయణ, ఏపీవో(పవర్) మునీర్‌పాషా, ఎస్‌డీసీ రవీంద్రనాథ్, ఉద్యాన అధికారి ఉదయ్‌కుమార్, డీఎం జీసీసీ సమ్మయ్య, ఎల్‌టీఆర్ ముదిరాజ్, డీఈ హరీశ్, వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది ప్రసాద్, భద్రమ్మ, మణికుమారి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.



గేటుకు తాళం వేసి బంద్ పాటిస్తున్న ఖమ్మం వికాస్ డిగ్రీ కళాశాల

# బోధనం బంద్

- ఉమ్మడి జిల్లాలో బంద్ పాటించిన ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు
- మొత్తం 40 కళాశాలలకు రూ.150 కోట్లపైనే బకాయిలు
- 'రీయింబర్స్‌మెంట్'కు మొర పెట్టుకున్నా ఆలకించని ప్రభుత్వం
- భవిష్యత్ కార్యాచరణకు నేడు సమావేశం కానున్న యాజమాన్యాలు





ఖమ్మం డీఆర్‌ఎస్ డిగ్రీ కళాశాల ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న యాజమాన్య బాధ్యులు, అధ్యాపకులు





ఖమ్మం, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి జిల్లాలోని ప్రైవేటు, పీజీ కళాశాలలు సోమవారం బంద్ పాటించాయి. రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరుతూ ఈ కళాశాలల యాజమాన్యాలు మొరపెట్టుకున్నా ప్రభుత్వం ఆలకించకపోవడంతో బంద్ నిర్ణయాన్ని తీసుకున్నాయి. సుమారు రూ.150 కోట్ల మేర బోధనా రుసుములు బకాయి కింద ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలలకు రావాల్సి ఉంది. నెలలు గడుస్తున్నాయి తప్ప నిధులు రావట్లేదు. ఎప్పుడిస్తారో కూడా తెలియడం లేదు. దీంతో చేతిలో నిధులు లేకపోవడంతో కళాశాలల నిర్వహణ వాటి యాజమాన్యాలకు భారంగా మారింది. రీయింబర్స్‌మెంట్ విడుదలపై ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక స్పందించిన పాపానపోలేదు. కొత్త విద్యాసంవత్సరంలో నిధులు విడుదల చేస్తారులే అని నెట్టుకొస్తున్నా.. కనీసం కనికరమూ చూపడం లేదు. దీంతో కళాశాలలను తాము నడపలేమంటూ వాటి యాజమాన్యాలు బంద్‌కు పిలుపునిచ్చాయి. ప్రస్తుతానికి డిగ్రీ, పీజీ విద్యాసంస్థలు బంద్‌కు పిలుపునివ్వగా.. మిగిలిన విద్యాసంస్థలు కూడా అదే ఆలోచనలో ఉన్నాయి.

### 40 కళాశాలలుపైగానే..

ఉమ్మడి జిల్లాలో సుమారు 40కిపైగా డిగ్రీ కళాశాలలున్నాయి. గతంలో 100కు పైగా డిగ్రీ కళాశాలలు ఉండేవి. ఒకవైపు డిగ్రీలో చేరే విద్యార్థుల సంఖ్య తగ్గుతుండడం, మరోవైపు నిర్వహణ భారాలు మోపవుతుండడం వంటి కారణాలతో కళాశాలలు క్రమంగా మూతపడుతూ వస్తున్నాయి. జిల్లాలో ఇంటర్‌లో 20 వేల మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అవుతుండగా.. 7 నుంచి 8 వేల మంది ఇంజినీరింగ్ వైపు వెళ్తున్నారు. మరో పది వేల మంది డిగ్రీలో చేరుతున్నారు. అలాగే, డిగ్రీకి అనుబంధంగా మరో పదిహేను వరకు పీజీ కళాశాలలు ఉన్నాయి. వాటిల్లో సుమారు మూడు వేల మంది వరకు విద్యనభ్యసిస్తున్నారు.

### రూపాయి కూడా రాలేదు..

డిగ్రీలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు కోర్సులను బట్టి రూ.10 వేల నుంచి రూ.13 వేల వరకూ ఫీజులుంటాయి. ఎక్కువ శాతం మంది విద్యార్థులకు ప్రభుత్వమే రుసుములు చెల్లిస్తున్నది. నేరుగా ఆయా కళాశాలల ఖాతాల్లోకే బోధనా రుసుముల కింద నిధులు జమచేయాల్సి ఉంటుంది. అయితే, ఎప్పటికప్పుడు ప్రభుత్వం వీటిని చెల్లించకపోవడంతో బకాయిలు పేరుకుపోతున్నాయి. ఒక్క ఉమ్మడి ఖమ్మం జిల్లాకే సుమారు రూ.150 కోట్లు రావాల్సి ఉందని కళాశాలల యాజమాన్యాలు పేర్కొంటున్నాయి. నిరుడు డిగ్రీలో చేరిన విద్యార్థులకు సంబంధించిన రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం చెల్లించలేదు. మిగిలిన రెండు, మూడు సంవత్సరాల విద్యార్థులకు కూడా చెల్లింపులు జరగలేదు. రూ.కోట్లాది నిధులు ఆగిపోవడంతో కళాశాలల నిర్వహణ తమకు చాలా కష్టంగా ఉంటున్నదని యాజమాన్యాలు చెబుతున్నాయి.

### అద్దెలు చెల్లించలేక.. వేతనాలు ఇవ్వలేక..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం కళాశాలల్లో ఆధునిక వసతులు కల్పించాలి. నిపుణులైన అధ్యాపకులను నియమించాలి. అయితే, తమకున్న పరిధిలో వీటన్నింటినీ సమకూర్చేందుకు యాజమాన్యాలు పెద్ద మొత్తంలో ఖర్చు చేశాయి. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని మరీ ఇప్పటి వరకు ఎలాగోలా నెట్టుకొచ్చాయి. కానీ ఇప్పటికీ రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో ఆయా యాజమాన్యాలు బ్యాంకులకు వడ్డీ కూడా చెల్లించలేకపోతున్నాయి. ఏడాదికిపైగా అద్దెలు కట్టలేక, అధ్యాపకులు వేతనాలు చెల్లించలేక సతమతమవుతున్నాయి. ఈ క్రమంలో తప్పనిసరి పరిస్థితుల్లో కళాశాలల బంద్‌కు పిలుపునిచ్చాయి.

### తెరుచుకోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు

దసరా సెలవుల అనంతరం డిగ్రీ కళాశాలల్లో తరగతులు ప్రారంభం కావాల్సి ఉండగా.. సోమవారం ఉమ్మడి జిల్లాలో ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు తెరుచుకోలేదు. కళాశాలల బంద్ పాటిస్తున్నట్లు విద్యార్థులకు సమాచారం ఇచ్చారు. రీయింబర్స్‌మెంట్ చెల్లించని కారణంగా బంద్‌కి పిలుపునిచ్చినట్లు అన్ని కళాశాలల ఎదుట ఫ్లెక్సీలు ప్రదర్శించారు. జిల్లాలోని అన్ని కళాశాలల యాజమాన్యాలు మంగళవారం సమావేశమై భవిష్యత్ కార్యాచరణను ప్రకటించనున్నాయి.

### బకాయిలు వెంటనే విడుదల చేయాలి..



తమకు రావాల్సిన బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి. విద్యకు అత్యధిక ప్రాధాన్యమిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గొప్పలు చెబుతున్నారు. కానీ ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు చెల్లించాల్సిన రీయింబర్స్‌మెంట్ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. బకాయిలు విడుదల చేసే వరకు బంద్ కొనసాగుతుంది.

–గుండాల కృష్ణ, ఆర్జేసీ డిగ్రీ, పీజీ కాలేజీ కరస్పాండెంట్

### మా సమస్యలు వినడానికీ ఇష్టపడట్లేదు..



కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సమస్యలు వినడానికి కూడా ఇష్టపడట్లేదు. రీయింబర్స్‌మెంట్‌పై ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవట్లేదు. నాయకులు, అధికారులకు సమస్య తీవ్రతను వివరించాం. బంద్ అంశాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం.

–మద్ది ప్రభాకర్‌రెడ్డి, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల సంఘం ప్రధాన కార్యదర్శి

# ప్రయాణికులకు చుక్కలు

- బతుకమ్మ వేడుకలు, దసరా సెలవులు ముగియడంతో ఒక్కసారిగా పెరిగిన రద్దీ
- అందుకు అనుగుణంగా బస్సులు నడపని ఉమ్మడి ఆర్టీసీ అధికారులు
- స్పెషల్ బస్సులే అత్యధికం.. వాటిల్లో 50 శాతం చార్జీ అదనం
- సాధారణ సర్వీసుల కుదింపు.. దూర ప్రాంతాలకు 'ప్రత్యేక' పెంపు
- ఉమ్మడి జిల్లాలో కిటకిటలాడిన బస్టాండ్లు.. కిక్కిరిసిన బస్సులు



ప్రయాణికులతో కిక్కిరిసిన అశ్వారావుపేట బస్టాండ్

అశ్వారావుపేట టౌన్/ఇల్లెందు రూరల్, అక్టోబర్ 14 : ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రయాణికులకు ఆర్టీసీ సంస్థ సోమవారం చుక్కలు చూపించింది. దసరా వేడుకలు, విద్యాసంస్థలకు సెలవులు ముగియడంతో ఒక్కసారిగా రద్దీ పెరిగింది. వార ఆరంభం కావడం.. ఉద్యోగ, ఉపాధి నిమిత్తం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు ఒక్కసారిగా బయలుదేరడం వంటి కారణాలతో ఆర్టీసీ బస్టాండ్లన్నీ ఉదయం నుంచే ప్రయాణికులతో కిటకిటలాడాయి. 'బస్సుల్లో సీట్లు లభించడం సంగతి దేవుడెరుగు.. కనీసం నిలబడి ప్రయాణించేందుకు చోటు దొరికినా చాలు..' అనుకుంటూ ప్రయాణికులు అగచాట్లు పడడం సోమవారం నాటి రద్దీకి నిదర్శనం.

బతుకమ్మ, దసరా పండుగల కోసం పది, పదిహేను రోజుల క్రితమే వసతి గృహాల నుంచి ఇళ్లకు వచ్చిన విద్యార్థులు.. మంగళవారం నుంచి విద్యాసంస్థలు ప్రారంభం కానుండడంతో సోమవారం తిరుగు ప్రయాణమయ్యారు. మళ్లీ సరంజామా అంతా మోసుకుంటూ వారిని హాస్టళ్ల వద్ద దింపేందుకు తల్లిదండ్రులు కూడా తోడు రావడంతో ప్రయాణికుల సంఖ్య పెరిగింది. పండుగ వేడుకలను కుటుంబ సభ్యులతో గడిపేందుకు సొంతూళ్లకు వచ్చిన దూర ప్రాంతాల ఉద్యోగులు, కార్మికులు కూడా తిరిగి తమ పని ప్రదేశాలైన పట్టణాలు, నగరాలకు వెళ్లేందుకు సోమవారమే ప్రయాణమయ్యారు. పండుగలకు వచ్చిన బంధువులు కూడా ఇదే రోజున తిరిగి తమ సొంతూళ్లకు బయలుదేరడంతో రద్దీ ఒక్కసారిగా పెరిగింది.

### స్పెషల్ బస్సుల్లో 50 శాతం చార్జీ అదనం

దసరా పండుగ కోసం జిల్లాలోని అంతర్గత సర్వీసులను కుదించిన ఆర్టీసీ అధికారులు.. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు అదనపు బస్సులను పెంచింది. దీంతో ఉమ్మడి జిల్లాలోని గ్రామాల నుంచి పట్టణాలకు, పట్టణాల నుంచి నగరాలకు రాకపోకలు సాగించే సర్వీసులు అమాంతం తగ్గాయి. 'స్పెషల్ బోర్డులు, స్పెషల్ సర్వీసు నెంబర్ల'తో హైదరాబాద్‌కు గణనీయమైన సంఖ్యలో బస్సులు నడిచాయి. దీంతో ఉమ్మడి జిల్లాలో పట్టణాల మధ్య రాకపోకల కోసం బస్సుల సంఖ్య అదేస్థాయిలో తగ్గడంతో ప్రయాణికులు అరిగోస పడ్డారు. స్పెషల్ బస్సుల పేరిట నడిపిన సర్వీసుల్లో 50 శాతం అదనపు చార్జీలను వసూలు చేశారు. ఉదాహరణకు.. రెండు పట్టణాల మధ్య మామూలు రోజుల్లో సాధారణ ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రూ.100 చార్జీ అనుకుంటే సోమవారం నడిపిన ప్రత్యేక బస్సుల్లో 50 శాతం చార్జీ పెంచారు. అంటే మరో రూ.50 అదనంగా ప్రయాణికులపై భారం వేశారు. దీంతో అదే మార్గంలో మామూలు రోజుల్లో రూ.100గా ఉన్న చార్జీ సోమవారం నాటి ప్రత్యేక బస్సుల్లో రూ.150 చొప్పున చార్జీలు విధించారు. ఇక ఇదే బస్సుల్లో 'మహాలక్ష్మి' పథకం కింద మహిళా ప్రయాణికులను అనుమతించలేదు. ఒకవేళ మహిళలు బస్సు ఎక్కినా వారి వద్ద నుంచి స్పెషల్ చార్జీలో 50 శాతం వసూలు చేశారు. అంటే ప్రత్యేక సర్వీసులో విధించిన రూ.150లో 50 శాతం అంటే రూ.75 చొప్పున మహిళల వద్ద చార్జీలు తీసుకున్నారు. దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో కొందరు మహిళలు 50 శాతం చెల్లించి టికెట్ తీసుకోగా.. మరికొందరు మహిళలు సాధారణ ఎక్స్‌ప్రెస్ బస్సు వచ్చేంత వరకూ ఎదురుచూస్తూనే ఉన్నారు. ఇక భద్రాచలం, మణుగూరు డిపోల నుంచి హైదరాబాద్‌కు నడిపిన ప్రత్యేక బస్సులకు స్టేజీలను అమాంతంగా కుదించారు. భద్రాచలం నుంచి బయలుదేరిన స్పెషల్ ఎక్స్‌ప్రెస్ బస్సులకు పాల్వంచ, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేటలో మాత్రమే స్టాప్‌లు ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలోని సుజాతనగర్, జూలూరుపాడు, ఏన్కూరు, తల్లాడ, వైరా, కొణిజర్ల స్టేజీల్లో స్టాపులు లేవంటూ చెప్పడంతో వారంతా ఆయా బస్సుల్లో ప్రయాణించలేకపోయారు.



అశ్వారావుపేటలో ఆర్టీసీ బస్సుల వద్ద ప్రయాణికుల రద్దీ



ఇల్లెందు బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సు వద్ద వందలాది ప్రయాణికులు

# పాత పద్ధతిలోనే కౌన్సిలింగ్

- 'వెబ్ కౌన్సిలింగ్'కు స్వస్తి పలికిన కాంగ్రెస్ సర్కార్
- నేడు డీఎస్సీ-2024 అభ్యర్థులకు కౌన్సిలింగ్
- రేపటి నుంచే రిపోర్టు చేయనున్న కొత్త టీచర్లు
- ఇక బదిలీ ఎస్‌జీటీలు, డిప్యూటేషన్ టీచర్లు రిలీవ్



ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 14 : ఖమ్మం జిల్లాలో డీఎస్సీ 2024 ద్వారా ఎంపికైన 520 మంది టీచర్లకు పోస్టింగ్‌లు ఇచ్చే ప్రక్రియ మంగళవారం జరుగనున్నది. అయితే అభ్యర్థులకు నిర్వహించే కౌన్సిలింగ్‌లో పాత విధానాన్ని అమలుపరుస్తున్నారు. ఎలాంటి అక్రమాలకు తావులేకుండా తీసుకొచ్చిన 'వెబ్ కౌన్సిలింగ్' విధానాన్ని పక్కన బెట్టి, గతంలో ఎన్నోసార్లు గందరగోళంగా మారిన పాత ప్రక్రియను తీసుకొచ్చారు. గత ప్రభుత్వం వేల మంది ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియను ఎలాంటి ఆరోపణలకు ఆస్కారం లేకుండా వెబ్ కౌన్సిలింగ్ పద్ధతిలోనే పూర్తిచేసింది. అయితే ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ మాత్రం వెబ్ కౌన్సిలింగ్ విధానాన్ని పక్కనబెట్టి పాత పద్ధతిలో కౌన్సిలింగ్ చేసేందుకు సిద్ధమవ్వడంతో పలు అనుమానాలకు దారితీస్తోంది.

### ఇక బదిలీ ఎస్‌జీటీలు రిలీవ్..

ప్రభుత్వం నిర్వహించిన స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీల బదిలీల ప్రక్రియలో బదిలీ అయినప్పటికీ రిలీవ్ కాని ఉపాధ్యాయులు మంగళవారం రిలీవ్ కావాలని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. వీరితోపాటు డిప్యూటేషన్‌పై కొనసాగుతున్న ఉపాధ్యాయుల స్థానంలో నూతన ఉపాధ్యాయులు నియమితులైతే డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న టీచర్ల డిప్యూటేషన్ రద్దు కానుంది. కౌన్సిలింగ్‌లో పోస్టింగ్ అందుకున్న ఉపాధ్యాయులు ఈ నెల 16వ తేదీ నుంచి పాఠశాలల్లో రిపోర్ట్ చేసేలా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేయనున్నది.

### 21 మందికి బాధ్యతల అప్పగింత..

నూతన టీచర్లకు పోస్టింగ్‌లు కల్పించే కౌన్సిలింగ్ ప్రక్రియకు జిల్లాలోని 21మంది ఎంఈవోలకు బాధ్యతలు అప్పగించారు. డీఈవో కార్యాలయంలోని సూపరింటెండెంట్స్ నుంచి అటెండర్ల వరకు పూర్తిస్థాయిలో సిబ్బందిని మంగళవారం డైట్ కళాశాలలో నిర్వహించే కౌన్సిలింగ్ ప్రక్రియ వద్ద విధులు నిర్వహించేలా నియమించారు. కౌన్సిలింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులు నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో రావాలని డీఈవో సూచించారు.

### 1:1 నిష్పత్తిలో జాబితా..

డీఎస్సీ 2024 ఉపాధ్యాయులకు సంబంధించి పోస్టింగ్స్ ఇచ్చేందుకు ముందుగా 1:1 నిష్పత్తిలో ఖాళీల జాబితాను ప్రదర్శించనున్నారు. స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్ టీచర్, లాంగ్వేజ్ పండిట్స్, పీఈటీలు ఇలా అన్ని విభాగాల్లో 1:1 నిష్పత్తిలో జాబితాను ప్రకటించనున్నారు. దీనిలో కూడా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా లేని మారుమూల ప్రాంతాల్లోని స్కూల్స్‌కి ప్రాధాన్యత కల్పిస్తున్నారు. ఎర్రుపాలెం, వేంసూరు, కారేపల్లి, మధిర వంటి మండలాల్లోని స్కూల్స్‌ని జాబితాలో చేర్చారు. 520మంది అభ్యర్థులకు 520 ఖాళీల జాబితాను విద్యాశాఖాధికారులు సిద్ధం చేశారు. డైట్‌లో కౌన్సిలింగ్ నిర్వహణకు అవసరమైన కంప్యూటర్లు, కౌన్సిలింగ్ అనంతరం వెంటనే పోస్టింగ్ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు.

### కౌన్సిలింగ్ తర్వాత.. పాఠశాలల కేటాయింపు..

కొత్తగూడెం ఎడ్యుకేషన్, అక్టోబర్ 14 : డీఎస్సీ-2024లో ఎంపికై డీఈవో కార్యాలయంలో రిపోర్టు చేసిన అభ్యర్థులకు మంగళవారం ఉదయం 10 గంటల నుంచి కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు డీఈవో వెంకటేశ్వరాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత కొత్తగూడెంలోని ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో వీరికి కౌన్సిలింగ్ నిర్వహించి, పాఠశాలలను కేటాయిస్తామని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులు తమ నియామక పత్రాలతో హాజరుకావాలని ఆయన కోరారు.